# ప్రమోషన్.. రివర్షన్

- నలుగురిపై వేటు, ఇద్దరిపై తాత్సారం చేస్తున్న అధికారులు
- ఇందులో చక్రం తిప్పుతున్న ఓ మండల విద్యాశాఖ అధికారి
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- అక్రమాలపై లోతుగా విచారణ జరిపించాలంటున్న విద్యావేత్తలు


పదోన్నతి పొందిన టీచర్ల వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న డీఈవో సోమశేఖర శర్మ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 24 : ప్రత్యేక ఉపాధ్యాయుల పదోన్నతుల వ్యవహారంలో జరిగిన అవినీతి, అక్రమాల పరంపరను 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. జిల్లా విద్యాశాఖలో కొన్నాళ్లుగా జరుగుతున్న వరుస తప్పిదాలు, అక్రమాలను సరిచేసుకునే క్రమంలో చేసిన తప్పును మరో రూపంలో తమకేం తెలియదన్నట్లుగా కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టమవుతున్నది. జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్)లుగా గత జూన్ నెలలో ఏడుగురికి పదోన్నతి కల్పించారు. మొత్తం 21 పోస్టులకు.. ఏడుగురు మాత్రమే దరఖాస్తు చేసుకోగా.. వారికి పదోన్నతులు ఇచ్చారు. ఇందులో పదోన్నతి కోసం స్పెషల్ బీఈడీతోపాటు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్సీఐ) జారీ చేసిన సెంట్రల్ రిహాబిలిటేషన్ రిజిస్ట్రి(సీఆర్ఆర్) ధ్రువపత్రం కూడా తప్పనిసరి. దీంతోపాటు సదరు అభ్యర్థికి స్పెషల్ బీఈడీ విద్యార్హత లేకపోతే రెగ్యులర్ బీఈడీ చేసిన వారు, దివ్యాంగులకు సంబంధించిన ప్రత్యేక కోర్సు చేసిన వారు అయి ఉండాలి. అభ్యర్థి పొందిన ఈ ధ్రువపత్రాలు కచ్చితంగా సీఆర్ఆర్లో నమోదైనప్పుడే అతడి అభ్యర్థిత్వం పరిగణనలోకి తీసుకుంటారు.

### నిబంధనలు తుంగలోకి..

అయితే జిల్లా విద్యాశాఖలో మాత్రం ఆయా నిబంధనలు మాకు వర్తించవంటూ అర్హత లేకపోయినా పదోన్నతులు కల్పించి చేతులు దులుపుకున్నారు. మొత్తం ఏడుగురు అభ్యర్థులలో ఒకరికి మాత్రమే తగిన అర్హతలున్నాయి. మిగతా ఆరుగురిలో ముగ్గురికి కనీసం స్పెషల్ బీఈడీ కానీ, దానికి సమానమైన సర్టిఫికెట్లు కూడా లేవు. దీంతో వారికి ఆర్సీఐ వచ్చే అవకాశమే లేదు. మరో ముగ్గురు అభ్యర్థుల విషయంలో విద్యార్హత ఉన్నప్పటికీ ఆర్సీఐ లేదు. మొత్తానికి పదోన్నతి పొందిన ఏడుగురు అభ్యర్థులలో ఆరుగురికి ఆర్సీఐ జారీ చేయాల్సిన సీఆర్ఆర్ లేకపోయినా పదోన్నతి కట్టబెట్టారు.

### మిగతా వారిపై చర్యలేవి?

ఇదిలా ఉండగా.. పదోన్నతి ఇచ్చే నాటికి సీఆర్ఆర్ లేకపోయినా పదోన్నతి పొందిన ఇద్దరిపై వేటు వేయకుండా తాత్సారం చేస్తున్నారు. దీనికి ఖమ్మం సమీపంలోని విద్యాశాఖ మండలాధికారి తన సమీప బంధువు పదోన్నతి పొందిన వారిలో ఉండడం.. అతడి ఒత్తిడి మేరకు డీఈవో వారిపై చర్యలు తీసుకోకుండా దాటవేత వైఖరి కనబరుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారిద్దరిలో ఒక అభ్యర్థిని తొలగిస్తే కుదరదని.. రివర్షన్ ఇస్తే ఇద్దరికి ఇవ్వాల్సి వస్తుందని సదరు అధికారి బంధువును కాపాడడం కోసం ఆ అభ్యర్థులిద్దరికి పదోన్నతి పొందిన తర్వాత అయినా సీఆర్ఆర్ వచ్చింది కదా.. అని అంటూ నిబంధనలకు వక్రభాష్యం చెబుతున్నారు. అయితే తాము చేసిన పనిని విద్యాశాఖ కార్యాలయం వారు సమర్థించుకుంటూ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించడం కొసమెరుపు. దీనిపై కలెక్టర్ సీరియస్గా స్పందించి.. ఇంకా ఏమైనా అక్రమాలు జరిగాయా? అనే కోణంలో లోతుగా విచారణ జరిపించాలని, అక్రమాలకు కారకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

### 'నమస్తే' కథనాలకు స్పందన..

జిల్లా విద్యాశాఖకు సంబంధించి వరుసగా 'ఉద్యోగోన్నతి పొందిన స్పెషల్ టీచర్లపై నీలినీడలు', 'అర్హత లేని వారికి ప్రత్యేక అందలం' అనే శీర్షికల పేరిట 'నమస్తే' ప్రత్యేక కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన విద్యాశాఖ యంత్రాంగం అందరు అభ్యర్థుల సర్టిఫికెట్లను మరోసారి సోమవారం తెప్పించి పరిశీలించింది. వెంటనే చర్యలు తీసుకోకుండా అధికారులు యథాప్రకారం దాటవేసినా.. 'నమస్తే' కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు సీరియస్గా ఆదేశించారు. దీంతో మంగళవారం రోజంతా డీఈవో సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో సిబ్బంది తమ పొరపాట్లను ఎలా కప్పిపుచ్చుకోవాలనే ఆలోచనలో పడ్డారు. చివరకు సాయంత్రం నలుగురు అభ్యర్థుల నుంచి స్వచ్ఛందంగా తామే ఈ పదోన్నతి పోస్టులో కొనసాగలేమని, రివర్షన్ ఇప్పించాలని లిఖిత పూర్వకంగా అభ్యర్థన సమర్పిస్తే వారు కోరినట్లుగా ఖమ్మం సమీప పాఠశాలలో పోస్టింగ్ ఇస్తామని చెప్పారు. దీంతో నలుగురు అభ్యర్థులు దరఖాస్తు సమర్పించడం.. వారికి రివర్షన్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిపోయింది. అయితే అక్రమంగా పదోన్నతి కల్పించిన వారిపై చర్యలు లేకుండా, పదోన్నతి పొందిన వారిని కనీసం వివరణ కూడా అడగకుండా విజయవంతంగా తమ లోపాన్ని సరిదిద్దుకున్నారు.

# దైవం మానవరూపమే క్రీస్తు

ప్రతి మానవుడు తప్పనిసరిగా, అత్యవసరంగా తెలుసుకోవాల్సిన అంశం దేవుడు. ప్రపంచంలోనే అతి ప్రాముఖ్యమైన సంగతి సైతం దేవుడే. ఇంతకీ దేవుడు ఎక్కడుంటాడు.. ఎలా ఉంటాడు.. ఆయన గుణగుణాలు ఏమిటీ.. ఇలా ఎన్నో ఏళ్లుగా మనిషి అన్వేషణ చేస్తూనే ఉన్నాడు. కానీ.. ఎవరు కూడా దేవున్ని సంపూర్ణంగా తెలుసుకోలేకపోయారు.. వర్ణించలేకనూపోయారు. అందుకే ఆ అదృశ్య దేవుని దృశ్యరూపమైన క్రీస్తునాధుడే పరము నుంచి భువికి దిగొచ్చాడు. ముందుగా ప్రవక్తలచేత చెప్పిన విధంగానే కన్య మరియ గర్భాన జన్మించాడు. ఈ లోకమంతటికీ దేవుని శక్తిని, ఆయన లక్షణాలన్నింటినీ తెలియజేశాడు. పాపాలు చేసి దేవుడికి దూరమైన మానవజాతిని మళ్లీ దేవుని ఎదుట పరిశుద్ధులుగా నిలబెట్టేందుకు తన ప్రాణాన్ని సిలువలో పణంగా పెట్టాడు. మనిషికి, దేవుడికి మధ్య వారధిగా మారిన దైవరూపమే యేసుక్రీస్తు. ఆ క్రీస్తు జననమే క్రిస్మస్.

- ఖమ్మం, డిసెంబర్ 24

- పరము నుంచి భువికి దిగివచ్చిన పరమాత్ముడు
- మానవజాతికి ఏకైక రక్షకుడు యేసు ప్రభువు
- నేడు ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముస్తాబైన చర్చిలు
- అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ఆరాధనలు


క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన కరుణగిరి పుణ్యక్షేత్రం


క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపే బొమ్మలు



కరుణామయుడు, ప్రేమమయుడు, దయామయుడు యేసుక్రీస్తు జన్మదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఖమ్మం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చిలన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవుల పండుగల్లో ప్రధానమైనది యేసుక్రీస్తు జన్మదినమైన డిసెంబర్ 25వ తేదీన జరుపుకునే క్రిస్మస్ పండుగ. నవంబర్ 25 నుంచే సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవుల షాపింగ్ల సందడి ముగిసింది. పండుగ వారంరోజుల ముందు నుంచే ఖమ్మం నగరంలో సందడి నెలకొంది. క్రిస్మస్ వేడుకల కోసం కేక్లు, స్వీట్లు ఆర్డర్ ఇచ్చేందుకు స్వీటు షాపులు కిటకిటలాడాయి. క్రైస్తవుల ఇళ్లపైన నక్షత్రం ఆకారంలో విద్యుత్ బల్బులు ఏర్పాటు చేశారు. అంతటా క్రిస్మస్ ట్రీలు, బెల్స్, బెలూన్లు, స్టార్లు, శాంతాక్లాజ్ స్టిక్కర్లు, పండుగ శుభాకాంక్షలు తెలిపే బోర్డులు, పశువుల పాకలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

### పశువుల పాకలో యేసు జననం..

నెలలు నిండిన కన్య మరియమ్మను ఏసోబు తన సొంత గ్రామమైన బేత్లెహేముకు తీసుకుని వెళ్లారు. కానీ.. వారికి ఆగ్రామంలో ఎక్కడా చోటు లభించదు. చివరికి ఒక పశువుల పాకలో తలదాచుకోవడానికి చోటు లభిస్తుంది. అప్పటికే నొప్పులు పడుతున్న మరియమ్మ చిన్నారి యేసుకు జన్మనిస్తుంది. ఆ బాల ఏసును పొత్తి గుడ్డల్లో చుట్టి పశువుల తొట్టిలో ఉంచుతారు. దేవుడు భూమిపై జన్మించాలనుకుంటే ఏ రాజు కోటలోనో, ధనవంతుల ఇళ్లల్లో జన్మించి ఉండవచ్చు. కానీ.. తాను సామాన్య మానవుల కోసం లోకానికి వచ్చాననే సందేశాన్ని ఇవ్వడానికి పశువుల పాకలో క్రీస్తు జన్మించాడని క్రైస్తవుల విశ్వాసం.

### బహుమతుల శాంతాక్లాజ్..

మన దేశంలోని క్రిస్మస్ తాతనే పాశ్చాత్య దేశాల్లో శాంతాక్లాజ్గా పిలుస్తారు. క్రిస్మస్ తాత సంప్రదాయం మూడో శతాబ్దంలో ప్రాచుర్యంలోకి వచ్చింది. క్రిస్మస్కు ముందు రోజు రాత్రి క్రిస్మస్ తాత ఇంటింటికీ వెళ్లి బహుమతులను ఇంటి ముంగిట పెట్టి తలుపుకొట్టి వెళ్లి పోయేవాడని పాశ్చాత్య దేశాల్లో ప్రాచుర్యం ఉంది.

### గంటల ప్రత్యేకత..

గడియారాలు లేని రోజుల్లో చర్చిల్లో సమయానుసారంగా మోగించే గంటలే ఊరంతటికీ సమయమెంతో తెలిపేవి. ముఖ్యంగా చర్చిలో ప్రార్థనలు, ఆరాధనల వేళల్లో గంటలు మోగగానే అందరూ హాజరయ్యేవారు. ప్రభువు సన్నిధికి తాము వెళ్లే సమయాన్ని సూచిస్తున్నందున గంటకు ప్రత్యేకత ఏర్పడింది.

### అర్ధరాత్రి నుంచే ఆరాధనలు..

జిల్లాలో రోమ్ క్యాథలిక్ మిషన్(ఆర్సీఎం)కు చెందిన పలు చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ ఆరాధనలను ప్రారంభించారు. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి, నాయుడుపేట, ఖమ్మం నగరంలోని వైరా రోడ్డు, శ్రీనివాసనగర్, మౌంట్ఫోర్టు, తల్లాడ, కల్లూరు, పాల్వంచ, కొత్తగూడెంలలోని ఆర్సీఎం చర్చిల్లో, భద్రాచలంలోని సెయింట్ ఆన్స్ ఆర్సీఎం చర్చిల్లో రాత్రి 11 గంటల నుంచే క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభించారు. ప్రొటెస్టెన్స్ చర్చిలైన సెయింట్ మేరిస్, సీఎస్ఐ చర్చి, ఎన్ఎస్పీ క్యాంపులోని హోలీ ట్రినిటీ చర్చి, ఇందిరానగర్లోని సీఎస్ఐ క్రైస్ట్ చర్చి, ఖానాపురం హవేలీలోని లివర్స్ చర్చి, కూసుమంచిలోని ఇమ్మాన్యుయేల్ చర్చి, కొత్తగూడెంలోని ఆంద్రూస్ చర్చి, భద్రాచలంలోని సీఎస్ఐ క్రైస్ట్ చర్చి, పాల్వంచ, ఇల్లెందు, వైరా, రుద్రంపూర్, రామవరం, సత్తుపల్లిలోని సీఎస్ఐ చర్చిల్లో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి క్రిస్మస్ ఆరాధనలను నిర్వహించనున్నారు.



# కూరగాయలు విక్రయిస్తూ.. శ్రీరాముడికి వినతిపత్రం ఇస్తూ..

**ఖమ్మం, భద్రాద్రిలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన**

**15వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె**


ఖమ్మం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద కూరగాయలు విక్రయిస్తూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్/ కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 24: తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరుకుంది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదు. దీంతో తమ ఆందోళనను మరింత ఉధృతం చేసిన ఉద్యోగులు.. రోజుకో రీతిలో వినూత్నంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద చేపట్టిన ఆందోళనలో భాగంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు కూరగాయలు విక్రయిస్తూ నిరసన తెలిపారు. భద్రాద్రి జిల్లాలో మరికొంత వినూత్నంగా చేశారు. జిల్లా కేంద్రం నుంచి 40 కిలోమీటర్ల దూరంలో భద్రాచలానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ మహార్యాలీ నిర్వహించారు. ఆ తరువాత గోదావరి వద్దకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. తరువాత అక్కడి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమను రెగ్యులరైజ్ చేసేలా ముఖ్యమంత్రిని కరుణించాలంటూ వేడుకున్నారు. తరువాత రామయ్య విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. మరణించిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల కుటుంబాలకు రూ.25 లక్షల సాయం అందించేలా సీఎంను దీవించాలని కోరుకున్నారు.

# ఉమ్మడి జిల్లాపై 'అల్పపీడనం' ప్రభావం

## పలు మండలాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం


కూసుమంచి మండలం నర్సింహులగూడెంలో ధాన్యంపై పట్టాలు కప్పుతున్న రైతులు


ఖమ్మంలో వర్షంలో తడుస్తూ వెళ్తున్న వాహనదారులు

ఖమ్మం వ్యవసాయం/కూసుమంచి/అన్నపురెడ్డిపల్లి/అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 24 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై పడింది. ఇప్పటికే పొరుగునున్న ఆంధ్రప్రదేశ్లోని ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై కూడా స్వల్పంగా పడింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నుంచి సూర్యుడి జాడ కరువైంది. దీంతో జిల్లాలో దట్టమైన మేఘాలు అలుముకున్నాయి. మధ్యాహ్నం తరువాత ఖమ్మం నగరంతోపాటు పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన జల్లులు కురిశాయి. దీంతో అప్రమత్తమైన అన్నదాతలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. ప్రస్తుతం వరి, పత్తి పంటలు ఇప్పటికే చేతికొచ్చాయి. మరి కొద్ది రోజుల్లో మిర్చి పంట కూడా చేతికి రానుంది. ఇదే సమయంలో తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇక ఈ అల్పపీడనం కారణంగా ఒక వైపు చలి తీవ్రత పెరుగుతోంది. మరోవైపు ఈదురుగాలులతో కూడిన జల్లులు కురుస్తున్నాయి. ఉదయం నుంచి మబ్బులు పట్టి ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడి మధ్యాహ్నం తరువాత చిరు జల్లులు కురవడంతో కూసుమంచి, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట మండలాల రైతులు అప్రమత్తమయ్యారు. పలు గ్రామాల్లోని రైతులు వెంటనే కల్లాలకు పరుగులు పెట్టారు. అక్కడున్న తమ ధాన్యం తడవకుండా వాటిపై పట్టాలు కప్పారు. కొన్ని చోట్ల ఆరబెట్టిన ధాన్యాన్ని ఏకంగా బస్తాల్లోకి ఎత్తి తడవని ప్రాంతాల్లోకి తరలించారు.



అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో కల్లంలోని ధాన్యం తడవకుండా కప్పిన పరదాలు

# వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి: డీఎంహెచ్వో


ధంసలాపురంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్వో డాక్టర్ కళావతీబాయి

రఘునాథపాలెం, డిసెంబర్ 24: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్య సిబ్బంది నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని, వారికి మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్వో) డాక్టర్ కళావతీ బాయి సూచించారు. రఘునాథ పాలెం, ఖమ్మం అర్బన్ మండలాల్లో మంగళవారం పర్యటించిన ఆమె.. మంచుకొండ, ధంసలాపురం పీహెచ్సీలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న వైద్య శిబిరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలకు బాధ్యులవుతారని స్పష్టం చేశారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు మందులు అందజేశారు. అనంతరం ధంసలాపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ను సందర్శించారు. మున్నేరు వరదలకు ధ్వంసమైన వైద్య పరికరాలను, రికార్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ సైదులు, డీపీవో మేకల దుర్గ, వైద్యాధికారులు డాక్టర్ విష్ణు, గోలి రమాదేవి, తాళ్లూరి శ్రీకాంత్, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## 'ముక్కోటి'కి పకడ్బందీ ఏర్పాట్లు : భద్రాద్రి కలెక్టర్

భద్రాచలం, డిసెంబర్ 24 : ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు తగినట్లుగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించ తలపెట్టిన ముక్కోటి ఏకాదశి ఉత్సవ ఏర్పాట్లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనం, తెప్పోత్సవం కార్యక్రమాలను వీక్షించేందుకు వచ్చే ప్రముఖులు, వీఐపీ, వీవీఐపీలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వైకుంఠ ద్వార దర్శనం తర్వాత స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఒక్కసారిగా వెళ్లే సమయంలో తొక్కిసలాట జరగకుండా రెవెన్యూ, పోలీసు శాఖలు పటిష్ట బందోబస్తు చేపట్టాలన్నారు. అనంతరం తెప్పోత్సవం జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, వంటకాలు తెలియజేసేలా ప్రత్యేకంగా స్టాల్స్, స్టేజీ ఏర్పాటు చేసి ఈనెల 31 నుంచి గిరిజనుల కళా ప్రదర్శనలు ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. గోదావరి పరిసరాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ట్రైబల్ గ్రామాల్లోని పాతకాలపు గుడిసెలు తాత్కాలికంగా ఏర్పాటు చేసి పర్యాటకులకు సౌకర్యంగా ఉండేలా వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. అనంతరం వికారాబాద్ జిల్లా జీవన్పేట నుంచి భద్రాచలం విహార యాత్రకు వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు ఇక్కడి దర్శనీయ స్థలాలను సందర్శించి.. ఆదివాసీల సంస్కృతిని తల్లిదండ్రులతో మళ్లీ వచ్చి వీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్రావు, ఆలయ ఈవో, తహసీల్దార్ పాల్గొన్నారు.














